బర్డ్ ఫ్లూపై భయాందోళన వద్దు

- ఇతర ప్రాంతాల కోళ్లు రాకుండా తనిఖీలు
- బాగా ఉడికించిన తర్వాతే చికెన్, గుడ్లు తినాలి
- కోళ్ల ఫారాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పాలకోడేరు: బర్డ్ ఫ్లూపై భయం వద్దని, చికెన్, గుడ్లు బాగా ఉడికించిన తర్వాతే తినాలని వైద్యారోగ్య, పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. కోళ్ల ఫారాల్లో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని అవగాహన కల్పిస్తున్నారు. కోళ్ల ఫారాలు, చికెన్ సెంటర్లలో పరిశుభ్రత పాటించకపోతే కోళ్లకు వ్యాధి సోకే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఉండి, భీమవరం నియోజకవర్గాల్లోకి రాకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయితే మాంసం ప్రియులు చికెన్, కోడి గుడ్లు తినేందుకు వెనుకాడడంతో చికెన్ విక్రయ దుకాణాలు, ఎగ్ సెంటర్లు అమ్మకాల్లేక వెలవెలబోతున్నాయి. రెస్టారెంట్లలో సైతం చికెన్‌తో తయారు చేసిన ఆహార పదార్థాల వినియోగం తగ్గుముఖం పట్టింది. చికెన్, కోడి గుడ్ల అమ్మకాలు గణనీయంగా తగ్గిపోవడంతో యజమానులు నష్టాల బారిన పడుతున్నారు.

ఫారాలు, కోళ్లు ఇలా..

నియోజకవర్గంలో ఆకివీడు, ఉండి, పాలకోడేరు, కాళ్ల మండలాల్లో ఐదు బాయిలర్, నాలుగు నాటు కోళ్ల ఫారాలు ఉన్నాయి. వీటిలో బ్రాయిలర్, లేయర్స్ కోళ్లు 24,640, పెరటి, నాటు కోళ్లు 92,750 వరకు ఉన్నాయి.

చెక్ పోస్ట్ వద్ద నిఘా

ఉండి నియోజకవర్గం కృష్ణా జిల్లా సరిహద్దులో ఉండడంతో తెలంగాణ, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి కోళ్లను తీసుకురాకుండా అధికారులు నిఘా పెట్టారు. పోలీసుల సహకారంతో పశువైద్యాధికారులు తనిఖీలు చేస్తున్నారు.




మొగల్లు గుత్తుల వారి పాలెం కోళ్ల ఫారం వద్ద తనిఖీ చేస్తున్న డాక్టర్ హేమ, కోడికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న డాక్టర్ జావర్ హుస్సేన్

లక్షణాలుంటే సంప్రదించండి



ఎక్కడైనా బర్డ్ ఫ్లూ అనుమానిత లక్షణాలు కనిపిస్తే తక్షణమే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలి. బర్డ్ ఫ్లూపై భయాందోళన వద్దు. మన ప్రాంతంలో బర్డ్ ఫ్లూ లేదు. వాతావరణ పరిస్థితుల కారణంగా ఎక్కడైనా కోళ్లు మరణిస్తే ఆందోళన చెందవద్దు. పశువైద్య సిబ్బందిని సంప్రదించాలి. కోళ్ల ఫరాలను సందర్శించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తాం.

– హేమ, మండల పశు వైద్యాధికారి, పాలకోడేరు

తగ్గిన చికెన్ అమ్మకాలు



గత మూడు వారాలుగా చికెన్ వ్యాపారం తగ్గింది. ప్రజల్లో బర్డ్ ఫ్లూ భయం ఎక్కువగా ఉంది. అధికారులు మాత్రం మన ప్రాంతంలో బర్డ్ ఫ్లూ లేదని చెబుతున్నారు. అయినా ప్రజల్లో భయాందోళన కొనసాగుతోంది. ఆదివారం 300 కేజీలు చికెన్ అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం 20 కేజీలు కూడా అమ్మలేకపోతున్నాం.

– సాలా పుల్లయ్య చికెన్ షాపు యజమాని పాలకోడేరు

క్లుప్తంగా

చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం



వేండ్రలో తడి, పొడి చెత్తను వేరు చేస్తున్న దృశ్యం

పాలకోడేరు: చెత్త రహిత గ్రామంగా తీర్చి దిద్దుకుందామని వేండ్ర పంచాయతీ కార్యదర్శి జి.కృష్ణమోహన్ అన్నారు. ఆయన శనివారం గ్రామంలో తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించారు. వీధుల్లోనే చెత్తను సేకరించి రిక్షాల్లో డంపింగ్ యార్డ్‌కి తరలించారు. చెత్త ద్వారా వర్మి కంపోస్ట్ తయారుచేసి రైతులకు ఎరువుగా ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటామని కృష్ణమోహన్ తెలిపారు. ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి నాగేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

ఏఐపై స్వర్ణాంధ్రలో అవగాహన



డాక్టర్ సచిన్ శివావిని సన్మానిస్తున్న యాజమాన్య సభ్యులు

నరసాపురం రూరల్: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) రంగంతో శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు రావడంతో పాటు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని జర్మనీకి చెందిన క్రేవావి టెక్నాలజి వ్యవస్థాపకుడు డాక్టర్ సచిన్ శివావి అన్నారు. శనివారం సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలోజరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఏఐ, అడ్వాన్స్‌డ్ మొబైల్ టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అందుకు కావాల్సిన టెక్నాలజీ, నైపుణ్యం గురించి ఆధునిక టెక్నాలజీ ఏవిధంగా ఉపయోగించుకోవాలి తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహనకల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కె.త్రినాథ వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, పాలకవర్గ సభ్యులు పులపర్తి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడెం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ

తాడేపల్లిగూడెం : స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌ను శనివారం జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో డ్రోన్ బీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసులను సత్వరం పరిష్కరించాలని సూచించామన్నారు. మహాశివరాత్రి, ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. తొలుత ఆయన పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆయన వెంట డీఎస్పీ డి.విశ్వనాథ్, పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సైలు నాగరాజు, శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సై కొండలరావు ఉన్నారు.

సందడిగా జోనల్ స్థాయి క్రీడా పోటీలు

పెంటపాడు: స్థానిక ఎస్వీవీఎస్ హిందూ హైస్కూల్లో మూడు రోజులపాటు కొనసాగనున్న స్కూలు ఫెడరేషన్ ఆఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మొదటిరోజు అథ్లెటిక్స్ పోటీల్లో పెంటపాడు పోస్టు బేసిక్ పాఠశాల నుంచి 6 విభాగాల్లో ఏడుగురు విద్యార్థులు ప్రతిభను కనపరిచారు. మండల విద్యాశాఖాధికారులు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్, హెచ్ఎం రాజేష్ తదితరులు పాల్గొన్నారు. 24,25 తేదీల్లో పలు విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఎంఈవోలు తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవోలు అభినందించారు.

అగ్రిగోల్డ్ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించాలి

తణుకు అర్బన్: అగ్రిగోల్డ్ బాధితుల సమస్య ను శాసనసభలో ప్రస్తావించి వారికి న్యాయం చేసేలా తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కృషి చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. శనివా రం అసోసియేషన్ ఆధ్వర్యంలో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ సమర్థ అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీ (ఎస్వీవీ)ని ఏర్పాటుచేసి బాధితుల సమస్యల పరిష్కరించాలని, అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయించి, జప్తు చేసిన ఆస్తులన్నింటిని కోర్టులో అబ్సెల్యూట్ చేయించాలని కోరారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి వై.నాగలక్ష్మి, తణుకు బ్రాంచ్ కార్యదర్శి ఎస్.రామశ్రీను పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

వీరవాసరం: రాయకుదురు, చింతల కోటి గరువు గ్రామ పంచాయతీల్లో శనివారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గెద్దం భారతి, దాసరి మహాలక్ష్మి, కార్యదర్శి ఎస్వీకే సూర్యనారాయణ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఈవోపీఆర్డీ సీహెచ్ఎస్వీ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చెరుకువాడ, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్య, పరిసరా పరిశుభ్రతపై ప్రచారం చేశారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఈవోపీఆర్డీ అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, వీఆర్వోలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించే వారికే పట్టం కట్టండి

పాలకోడేరు: సమస్యలు పరిష్కరించే వారికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టం కట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ ఓటర్లను కోరారు. శనివారం పాలకోడేరు మండలం శృంగవృక్షంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల రాఘవులను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు మొదటి ప్రాధాన్యత ఓటును రాఘవులుకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఉద్యమ ప్రస్థానంలో సమస్యలు పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేసిన 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయునిగా పనిచేసిన రాఘవులును చట్టసభకు పంపాల్సిన అవసరం మనందరినాపైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు ఆశ్రయ, రామయ్య, పాండురంగారావు, ఉదయ, కొటికలపాడు శ్రీను పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి డీవీ రాఘవులును గెలిపించాలని కోరుతున్న గోపాలన్

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి



అంగన్‌వాడీల శిక్షణలో పాల్గొన్న ఎంఈఓలు రవీంద్ర, సీతారామయ్య

ఆకివీడు : అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని ఎంఈఓలు ఎ.రవీంద్ర, సీతారామయ్యలు అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ స్కూల్‌లో నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల నాలుగో రోజు శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానంగా అంగన్‌వాడీ కేంద్రాలు రానున్న రోజుల్లో నడపనున్నారని తెలిపారు. చిన్నారుల్లో సృజనాత్మక శక్తి, భావోద్వేగాల్ని గుర్తించి తద్వారా వారికి విద్యా బోధన చేయాలని సూచించారు. అంగన్‌వాడీల్లో నైపుణ్యతకు శిక్షణ దోహదపడుతుందని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి మాట్లాడుతూ ప్రతి కార్యకర్తా ఉపాధ్యాయురాలుగా పనిచేయాలన్నారు.

పీఆర్‌సీకి నిధులు కేటాయించాలి

భీమవరం: రాష్ట్ర బడ్జెట్లో 12వ పీఆర్‌సీకి నిధులు కేటాయించి, ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని (ఐఆర్) ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 28న ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవ్స్, ఏపీ జీఎల్ఐ ఏరియర్స్‌కు నిధులు కేటాయించాలని కోరారు.

8న జాతీయ లోక్‌అదాలత్

భీమవరం: భీమవరంలో మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల రాజీ అయ్యేలా మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసుపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, ఫోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ అనానరు. శనివారం ఆయన న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. సుమారు 200 ఇన్సూరెన్స్ కేసులు ఉన్నాయన్నారు. సమావేశంలో న్యాయవాదులు నిమ్మల సత్యనారాయణ, పాకా రమేష్‌బాబు, ఎస్ సుధీర్, శేషు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలో వ్యర్థాలు వేస్తే చర్యలు

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాల రోడ్డును ఆనుకుని ప్రవహిస్తున్న పంట కాలువలో ప్లాస్టిక్ కవర్లు, ఆహార వ్యర్థాలు, చెత్త వేస్తే వెంటనే చర్యలు తీసుకుని కలుషితాన్ని అరికట్టాలని భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాసంస్థ చైర్మన్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మునిసిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.

పంట కాలువ నీరు దిగువ గ్రామాల ప్రజలు తాగునీరుగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ నీటిలో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని, ర్యాలీ నిర్వహించాలని సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మీనారాయణ

ఒత్తిడిని అధిగమిస్తే అధిక మార్కులు

కాళ్ల: పరీక్షల్లో ఒత్తిడిని అధిగమించి అధిక మార్కులు సాధించాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ కేవీ సుబ్బరాజు అన్నారు. కాళ్ల మండలం సీసలి హైస్కూల్లో జయలక్ష్మి సీ ఫుడ్స్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం ఏర్పాటుచేసిన మోటివేషన్ క్లాసులో ఆయన మాట్లాడారు. అనంతరం జయలక్ష్మి సీ ఫుడ్స్ ఎండీ మహినాథ్ ఆర్థిక సాయంతో పాఠశాలకు సుమారు రూ.50 వేలు విలువచేసే సీలింగ్ ఫ్యాన్లు, విద్యార్థులకు ప్యాడ్లు, క్యాంపస్ బాక్సులను అందజేశారు. యూ ట్యూబ్ వారు తయారు చేసిన రూ.20 వేలు విలువ చేసే గైడులను గ్రామస్తులు నూకల భోగేంద్రబాబు ఆర్థిక సాయంతో పదో తరగతి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



సీసలి హైస్కూల్లో మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ సుబ్బరాజు

ముగిసిన టెక్నికల్ సింపోజియం

భీమవరం: ఆర్థికపరమైన అంచనాలతో ఉద్యోగులు ఆర్థిక ప్రగతి సాధిస్తారని ఫైనాన్స్ అడ్వైజర్ ఎం కౌశిక్ అన్నారు. స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిపుణ 25 పేరుతో నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం శనివారం ముగిసింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా హాజరైన కౌశిక్ మాట్లాడుతూ ఆదాయం, ఖర్చు అంచనాలను ముదుపు చేసుకోవడంలో కూడా ప్రణాళిక బద్ధంగా సాగాలన్నారు. ఒక్కోసారి స్టాక్ మార్కెట్లో మార్పులు వచ్చినా కంపెనీల పరిస్థితి అధ్యయనం చేసిన తరువాతే పెట్టుబడిపై పరిశీలన చేయాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ నిపుణ కార్యక్రమానికి పూర్వవిద్యార్థుల అధిక సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమని చెప్పారు. విద్యార్థులు ఒకరి భావాలు ఒకరు పంచుకుంటూ స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌టీఈ ఫ్యాకల్టీ అడ్వైజర్ ఎస్ రామ్‌గోపాల్ రెడ్డి, స్టూడెంట్ బాడీ వైస్ ప్రెసిడెంట్ ఎస్ షణ్ముఖప్రియ, సంజయ్, రత్న కుమారి, కుసుమ, అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సింపోజియంలో మాట్లాడుతున్న కౌశిక్

మేమంతా కలిసికట్టుగా ఉంటాం

నరసాపురం: పట్టణంలోని అరుంధతీపేటలో కొన్నిరోజుల క్రితం రాళ్లు, కర్రలతో రోడ్డుపై దాడులకు పూనుకున్న రెండు వర్గాల వారు కలిసి అంగీకారానికి వచ్చారు. ఇకపై కలిసిమెలిసి ఉంటామని ఎలాంటి గొడవలకు దిగమని ఒకరికొకరు కరచాలనాలు చేసుకున్నారు. అరుంధతీపేటలో మాదిగ, రెల్లి సామాజిక వర్గాలు రెండు వర్గాలుగా చీలిపోయి గొడవలకు దిగారు. దీంతో పోలీసులు ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమల్లో పెట్టడం, గొడవలకు పాల్పడ్డ వారిపై కేసులు నమోదు చేశారు. అయితే దళిత నాయకులు కలుగజేసుకుని రాజీ కుదర్చారు. శనివారం వార్డులో విలేకరుల సమావేశం నిర్వహించి పూర్వం నుంచి మాదిగ, రెల్లి సామాజిక వర్గాలవారంతా సోదర భావంతో ఉంటున్నామని చెప్పారు. ఘర్షణ ఘటన దురదృష్టమని, పోలీసులు కూడా పూర్తి సహనంతో వ్యవహరించారని చెప్పారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ సిర్రా కాంతమ్మ వైఎస్సార్ సీపీ నేతలు ముసూడి రత్నం, ఆబోతు అర్పన్‌కుమార్, యార్లగడ్డ రవి, దళితనేతలు బందారు హరి, ఆకుల రామకృష్ణ, పెదారి శంకర్, మెరిపే తిరుమలరావు, కడిమి ప్రవీణ్‌కుమార్, మెరిపే దుర్గారావు, నీలాపు ప్రసాద్, కొండేటి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దల సమక్షంలో కరచాలనం చేసుకుంటున్న యువకులు

విద్యార్థినులు ఆటల్లోనూ రాణించాలి

నరసాపురం: నరసాపురం జోన్ లెవెల్ గ్రిగ్ బాలికల ఆటల పోటీలు శనివారం స్థానిక మిషన్ హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 300 మంది పోటీలకు హాజరయ్యారు. నరసాపురం ఎంఈఓ డి.పుష్పరాజ్యం పోటీలు ప్రారంభించారు. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ఉత్సాహం చూపించాలని అన్నారు. మొదటిరోజు కబడ్డీ, త్రోబాల్, కోకో విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వైభవంగా మావుళ్లమ్మ బోనాల ఉత్సవం

పెనుమంట్ర: మండలంలోని జుత్తిగ గ్రామంలో పంట పొలాల్లో ఉన్న మావుళ్లమ్మ వారి 19వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం అమ్మవారికి బోనాల ఉత్సవం నిర్వహించారు. గ్రామంలో బోనాలు ఎత్తుకున్న మహిళలు మావుళ్లమ్మ ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, సామూహిక భజనలు నిర్వహించారు. ఆదివారం ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన, తీర్థ మహోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.



జుత్తిగలో బోనాలతో వెళ్తున్న మహిళలు

క్షయ వ్యాధిపై అవగాహన

అత్తిలి: రెండువారాలకు మించి దగ్గు, ఆకలి తగ్గడం వంటి లక్షణాలుఉంటే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు జరిపించుకోవాలని టీబీ సూపర్‌వైజర్ కె.రమేష్ అన్నా రు. క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా శనివారం అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడు తూ క్షయ వ్యాధి నిర్ధారణ అయితే సరైన చికిత్స తీసుకుంటే త్వరగా కోలుకోవచ్చని సూచించారు. షుగర్ వ్యాధిగ్రస్తులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు క్షయ సోకే అవకాశాలు ఎక్కువని, కాబట్టి జాగ్రత్తలు తీసుకునేలా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 26న తాడేపల్లిగూడెం బస్టాండ్ నుంచి ప్రతి పది నిమిషాలకు వీరంపాలెంకు, ప్రతి 30 నిమిషాలకు పట్టిసం క్షేత్రానికి బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి తెలిపారు. భక్తులు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాగులో రసాయనాలతో చేటు

- విషతుల్యమవుతున్న పొలాలు
- ఆరోగ్యానికి పొంచి ఉన్న ముప్పు

నరసాపురం రూరల్: అధిక దిగుబడులపై ఆశతో మితిమీరిన రసాయన ఎరువుల వాడకం అనర్థాలకు కారణం అవుతుంది. ముఖ్యంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులను భారీగా వినియోగించడంతో పంటలు విషమెక్కుతున్నాయి. ప్రధానంగా తెగుళ్లను అంతమొందించేందుకు విచ్చలవిడిగా మోనోక్రొటోఫాస్, డైక్లోరోపాస్ లాంటి ప్రమాదకరమైన పురుగుల నివారణ మందులను పంటలపై అధిక మోతాదులో వినియోగిస్తున్నారు. దీంతో భూసారం తగ్గడమే కాకుండా దిగుబడులు నామమాత్రంగానే వస్తున్నాయి. రెండోసారి వేసిన పంటకు కనీస స్థాయిలో కూడా పెట్టుబడులు రావడం లేదు. రైతులు ఇలా చేయడం ద్వారా రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించడానికి వ్యవసాయశాఖ అధికారులు చేపడుతున్న చర్యలు ఫలితాలను ఇవ్వడంలేదు.

నియోజకవర్గంలో సాగు ఇలా

నరసాపురం నియోజకవర్గంలో నరసాపురంలో 9,200 ఎకరాల్లోనూ, మొగల్తూరు మండలంలో 1,200 ఎకరాలోనూ వరి సాగు చేస్తునున్నారు. వాస్తవానికి భూసార పరీక్షల ఆధారంగా రైతులు తమ పొలాల్లో ఎలాంటి మూలకాలు లోపించాయో? తెలుసుకుని వాటికి సంబందించిన ఎరువును మాత్రమే వేయాలి. దీనిపై గ్రామీణ ప్రాంత రైతులకు అవాహన లేకపోవడంతో అసలు తమ భూముల భూసార పరీక్షా పత్రాలు తీసుకోవడంగానీ, వాటి వివరాలు తెలుసుకోవడం గానీ చేయడం లేదు. ఒక వేళ వ్యవసాయాధికారులు చెప్పినప్పటికీ తమకు తోచిన విధంగా విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో దిగుబడిమాట ఎలాఉన్నా పంట భూములు విషతుల్యమవుతున్నాయి. ఈ భూముల్లో పండించిన పంటలు కూడా విషపూరితమవుతున్నాయి. ఇలాంటి ఉత్పత్తులను తినడంవల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుంది. వీటివల్ల పొలం గట్లపై పెరిగే పచ్చగడ్డి కూడా విషతుల్యమై ఆ గడ్డని వీటిని ఆహారంగా తీసుకునే పశువులు కూడా అనారోగ్యానికి గురవుతున్నాయి. అధికారులు స్పందించి రసాయనిక ఎరువులు అధికంగా వినియోగించకుండా రైతులకు అవగాహనా సదస్సులు నిర్వహించాలని పలువురు పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.



దాళ్వా వరిలో రసాయనిక మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

అతిగా వాడొద్దు



అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడడం మంచిది కాదు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా తగు సూచనల మేరకే ఎరువులు వాడాలి. విచక్షణారహితంగా వాడడం వల్ల ఆ పంటలు తిన్న వారి ఆరోగ్యం దెబ్బతింటుంది. పైగా భూసారం కూడా క్రమంగా తగ్గిపోతుంది. పచ్చిరొట్ట, ఇతర సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులు దృష్టి సారించాలి. **ఎం.శ్యామ్యూల్ జాన్సన్ మండల వ్యవసాయశాఖాధికారి**

సేంద్రియమే మేలు



ప్రస్తుత సమాజంలో సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగానికి కొద్దిపాటి శ్రమచేస్తే చాలు. ఎరువులు, పురుగు మందులకు వెచ్చించే ఖర్చును బట్టి చూస్తే ఆరోగ్యమైన దిగుబడిని అతి స్వల్ప ఖర్చుతో దక్కించుకోవచ్చును. నేను కూరగాయల సాగుతో పాటు వ్యవసాయం పండించేందుకు కూడా సేంద్రియ ఎరువులను వాడుతున్నాను.

– బైనపాలెం పండు, రైతు. ఎల్చిచర్ల